AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

భారీ ఉగ్రకుట్ర భగ్నం.. ఆరుగురి అరెస్ట్

అక్షరటుడే, వెబ్‌డెస్క్: గణతంత్ర దినోత్సవానికి ముందు రెండు ఉగ్రవాద మాడ్యూల్స్‌ను ఛేదించినట్లు పంజాబ్ పోలీసులు తెలిపారు. నిషేధిత సంస్థ బీఐకేకి చెందిన ఆరుగురు కార్యకర్తలను అరెస్టు చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ కార్యకర్త, తర్న్ తరణ్‌లోని దినేవాల్ గ్రామానికి చెందిన శరణ్ ప్రీత్ సింగ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో ఘటనలో పాకిస్తాన్ ఐఎస్ఐ మద్దతుగల ఉగ్రవాద నెట్‌వర్క్‌పై పోలీసులు దాడి చేశారు. ఆపరేషన్‌లో ఐదుగురు బీకేఐ కార్యకర్తలను అరెస్టు చేసి "ఆర్డీఎక్స్ ఆధారిత" ఇంప్రూవైజ్డ్ పేలుడు పరికరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పంజాబ్ రైల్వే లైన్‌లో భారీ పేలుడు

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: పంజాబ్‌లోని అమృతసర్ ఢిల్లీ రైల్వే లైన్‌లో భారీ పేలు డు చోటు చేసుకుంది. పేలు డు ధాటికి పట్టాలు ధ్వంసం అయ్యాయి. లోకో పైలెట్ తీవ్రంగా గాయపడ్డారు. పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలోని సిర్హింద్ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఒక రైల్వే లైన్‌లో గూడ్స్ రైలును లక్ష్యంగా చేసుకుని ఆర్డీఎక్స్ ద్వారా పేలుడుకు పాల్పడ్డారు. శక్తివంతమైన పేలుడు కావడంతో ట్రాక్ ధ్వంసమైంది. గూడ్స్ రైలు ఇంజిన్ తీవ్రంగా దెబ్బతింది. లోకో పైలెట్‌కు తీవ్ర గాయాలు కావడంతో అధికారులు ఆస్పత్రికి తరలించారు.

24-1-2026 (Saturday) MAIN EDITION

నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం..

అక్షరటుడే, హైదరాబాద్: నగరంలోని నాంపల్లి పరిధిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. చీరక్ గల్లి లైన్‌లో గల ఓ ఫర్నీచర్ షాపులో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. నాలుగు అంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు ప్రారంభమై పైకి వ్యాపించాయి. మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

స్టాలిన్ సర్కారుపై తమిళిసై ఫైర్

అక్షరటుడే, తమిళనాడు: తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వంపై బీజేపీ సీనియర్ నేత, మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ విరుచుకుపడ్డారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని సర్కార్‌ను ఆమె 'ట్రబుల్ ఇంజిన్' ప్రభుత్వంగా అభివర్ణించారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకెళ్తుంటే, తమిళనాడు సమస్యల వలయంలో చిక్కుకుందని ఎద్దేవా చేశారు.

శబరిమలలో షూటింగ్ వివాదం..



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: కేరళ రాష్ట్రంలోని శబరిమల ఆలయ సన్నిధానంలో సినిమా షూటింగ్ జరిగిందన్న ఆరోపణలు దేశ వ్యాప్తంగా కలకలం రేపాయి. ఈ ఆరోపణలపై ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు స్పందించింది. దీనిపై విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేపట్టనుందని టీడీబీ అధికారులు వెల్లడించారు.

అదిరిపోయే ఫీచర్లతో మోటో 'సిగ్నేచర్' ఫోన్ విడుదల

అక్షరటుడే, బిజినెస్‌డెస్క్: ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ మోటొరోలా కొత్త మోడల్‌ను లాంఛ్ చేసింది. మోటో సిగ్నేచర్‌ను శుక్రవారం భారత్‌లో విడుదల చేసింది. అద్భుతమైన ఫీచర్లతో తీసుకువచ్చిన ఈ ఫోన్ ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉండనుంది. ఈనెల 30 నుంచి సేల్స్ ప్రారంభం కానున్నాయి. 6.8 అంగుళాల సూపర్ హెచ్‌డీ ఎల్‌టీపీవో ఎక్స్‌ట్రీమ్ అమోలెడ్ డిస్‌ప్లే అమర్చారు. 5,200 ఎంఏహెచ్ సిలికాన్ కార్బన్ బ్యాటరీ ఇచ్చారు. ఇది 90 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్‌ను, 50వాట్స్ వైర్‌లెస్ ఫాస్ట్ ఛార్జింగ్‌ను సపోర్ట్ చేస్తుంది. మూడు వేరియంట్లలో లభించనుంది.

ముంబై మేయర్ ఎన్నిక ఫిబ్రవరికి వాయిదా..

అక్షరటుడే, ముంబై: బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) మేయర్ ఎన్నికలు ఆఖరి నిమిషంలో వాయిదా పడ్డాయి. జనవరి 31న జరగాల్సిన ఈ ఎన్నిక ఇప్పుడు ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన తమ గ్రూప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కాగా.. ముంబై మేయర్ పదవి కోసం బీజేపీ, షిండే శివసేన పోటీ పడుతున్న నేపథ్యంలో తాజా పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం.

అమెరికాలో భారత సంతతికి చెందిన నలుగురి హత్య

అక్షరటుడే, నేషనల్ డెస్క్ : అమెరికాలో దారుణం చోటు చేసుకుంది. జార్జియాలో ఓ వ్యక్తి భారత సంతతికి చెందిన వ్యక్తులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో నలుగురు భారత సంతతి పౌరులు చనిపోయినట్లు అట్లాంటాలోని భారత కాన్సులేట్ జనరల్ తెలిపింది. మృతులను మీము దోగ్రా, గౌరవ్ కుమార్, నిధి చందర్, హరీశ్ చందర్‌లుగా అధికారులు గుర్తించారు. కుటుంబ కలహాలే హత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో అనుమానితుడు విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

నైనీ కోల్ మైన్స్, సింగరేణిపై వస్తున్న ఆరోపణలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడారు. సింగరేణిపై కొన్ని రోజులుగా కట్టుకథలు, రాతలు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రకరకాలుగా తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వంపై కావాలని తప్పుడు కథనాలు రాస్తున్నారని మండిపడ్డారు. దోపిడీదారుల ప్రయోజనాల కోసం ఈ కథనాలు వస్తున్నట్లు కనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తొలిపలుకుల రాతల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో అని వ్యాఖ్యానించారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

సింగరేణిపై తప్పుడు కథనాలు..

■ దోపిడీదారుల ప్రయోజనాల కోసమే.. ■ వాస్తవాలు ప్రజలకు తెలియాలి ■ టెండర్లపై విచారణకు సిద్ధం ■ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సింగరేణి టెండర్ల విషయంలో నిజాలు బయటకు రావాలని భట్టి అన్నారు. వాస్తవాలు ప్రజలకు తెలియాలని చెప్పారు. అడ్డగోలు ప్రచారం చేసే వారి అసలు రూపం బయటపడాలన్నారు. పత్రికలు, నాయకులే కాదు, సోషల్ మీడియాలో కూడా ఇష్టమొచ్చినట్టుగా రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ వాస్తవాలు తెలియజేసేందుకు డాక్యుమెంట్లు ఇస్తామన్నారు. 2018లోనే టెండర్ డాక్యుమెంట్ కోల్ ఇండియా తయారుచేసి పంపించిందని ఆయన పేర్కొన్నారు. సైట్ విజిట్ తప్పనిసరి అనే నిబంధన కోల్ ఇండియానే పెట్టిందన్నారు. టెండర్ డాక్యుమెంట్లు వచ్చినప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉందన్నారు.

విచారణకు సిద్ధం

సింగరేణి టెండర్లపై హరీశ్‌రావు లేఖ రాయడం, కిషన్‌రెడ్డి విచారణ చేస్తామనడం మంచిదే అని భట్టి విక్రమార్క అన్నారు. అందరి నిర్ణయాలను తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. 2021లో సెంట్రల్ మైనింగ్ కూడా సైట్ విజిట్ తప్పనిసరి అని చెప్పిందని గుర్తు చేశారు. రైల్వే శాఖలో కూడా టెండర్ వేసే కంపెనీ సైట్ విజిట్ తప్పనిసరి అనే నిబంధన ఉందన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన టెండర్లపై విచారణకు సిద్ధమని ప్రకటించారు. పత్రికల్లో అడ్డగోలుగా ఏదిపడితే అది రాస్తే నడవదని ఆయన హెచ్చరించారు. తాను ఆస్తులు సంపాదించుకునేందుకు రాలేదన్నారు. సింగరేణిపై ఏ గద్దని, ఏ పెద్దలను వాలనీయనని స్పష్టం చేశారు.

కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

అక్షరటుడే, హైదరాబాద్: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు భేటీ అయ్యారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో శనివారం ఉదయం సమావేశం అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. మంగళవారం హరీశ్‌రావును ఏడు గంటల పాటు ప్రశ్నించారు. శుక్రవారం కేటీఆర్‌ను సైతం విచారించారు. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాప్ చేశారు, ఎవరి ఫోన్లు ట్యాప్ చేశారని అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. సిట్ విచారణపై కేసీఆర్ ఇద్దరు నేతలతో చర్చించారు. విచారణ ఎలా జరిగిందని ఆరా తీసినట్లు తెలుస్తోంది.

మున్సిపల్ ఎన్నికలపై దిశానిర్దేశం

రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. మెజారిటీ వార్డులు, మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవాలని గులాబీ దళం భావిస్తోంది. ఈ మేరకు కేసీఆర్ పార్టీ నేతలతో సమావేశం అయ్యారు. మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు.

టీ హబ్‌లోకి కార్యాలయాల తరలింపుపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

అక్షరటుడే, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీ హబ్‌లోకి ప్రభుత్వ కార్యాలయాల తరలింపును నిలిపి వేసింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ నగరంలోని రాయదుర్గంలో టీ హబ్ ఏర్పాటు చేశారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి దీనిని ప్రారంభించారు. దీనిని పారిశ్రామి కవేత్త రతన్ టాటా ప్రారంభించారు. ఇందులో ఎన్నో స్టార్టప్‌లు పురుడు పోసుకున్నాయి. ఎంతోమంది ఔత్సాహికవేత్తలు పారిశ్రామికవేత్తలుగా మారారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలు ప్రభుత్వ కార్యాలయాను టీ హబ్‌లోకి మార్చాలని నిర్ణయించింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో తాజాగా వెనక్కి తగ్గింది.

షోరూంల్లో వాహనాల రిజిస్ట్రేషన్

అక్షరటుడే, హైదరాబాద్: కొత్తగా వాహనాలు కొనుగోలు చేసే వారికి రవాణా శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. వాహన రిజిస్ట్రేషన్లలో నూతన విధానం తీసుకొచ్చింది. ఈ విధానం శనివారం నుంచి అమలులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా బైక్, కారు షోరూమ్‌ల్లోనే ఇక నుంచి వాహనాల రిజిస్ట్రేషన్ చేయనున్నారు. దీని కోసం గతంలో ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. అక్కడ గంటల తరబడి లైన్‌లో నిలిచి ఉండి ఫొటో దిగి, సైన్ చేసిన తర్వాత.. అధికారులు వచ్చి వాహనాన్ని తనిఖీ చేసేవారు. వారు ఒకే అంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేది. దీని కోసం ఆర్టీఏ కార్యాలయాల్లో పలువురు ఏజెంట్లు ఉండేవారు. వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయించేవారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కొత్త విధానాన్ని తీసుకొచ్చింది.

గాలి జనార్దన్ రెడ్డి ఆస్తికి నిప్పుపెట్టిన దుండగులు

అక్షరటుడే, కర్ణాటక: కర్ణాటకలోని బళ్లారి నగరంలో బీజేపీ ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ఆస్తికి దుండగులు నిప్పుపెట్టారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని 'జీ స్క్వేర్ లే అవుట్'లోని ఈ మోడల్ హౌస్ శుక్రవారం సాయంత్రం సుమారు 6:30 గంటల ప్రాంతంలో దుండుగులు నిప్పు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం పెద్ద ప్రమాదాన్ని తప్పించిందని అధికారులు పేర్కొన్నారు. ఈ మోడల్ హౌస్ సుమారు 109 ఎకరాల స్థలంలో ఉంది. గాలి జనార్ధన్ రెడ్డి, శ్రీరాములు పేర్లపై రిజిస్టర్ అయ్యి ఉంది. 13-14 ఏళ్ల క్రితం భవనాన్ని కొనుగోలుదారులను ఆకర్షించడానికి నిర్మించగా, ప్రస్తుతం దీని విలువ రూ. 3 కోట్లకు పైగా ఉంది. స్థానిక పోలీసుల ప్రకారం, దుండుగులు పెట్రోల్, డీజిల్ ఉపయోగించి నిప్పుపెట్టినట్లు తెలుస్తోంది.

నాకు నచ్చిన పనులే చేస్తున్నా..

అక్కినేని నాగచైతన్యను వివాహం చేసుకున్న తర్వాత సినిమాలకు దూరంగా ఉంటోంది శోభిత ధూళిపాళ్ల. పెళ్లి అనంతరం ఇంటి బాధ్యతల్లో నిమగ్నమైన ఈ అమ్మడు మళ్లీ వార్తల్లో నిలిచింది. అయితే తాజాగా ఆమె నటించిన చిత్రం 'చీకటిలో' జనవరి 23 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా శోభిత చేసిన ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన వ్యక్తిగత అభిప్రాయాలను, వృత్తిపరమైన నిర్ణయాలను పంచుకుంది. 'పెళ్లయిన తర్వాత వస్తున్న మొదటి సినిమా కదా.. జనాలు మిమ్మల్ని ఎలా రిసీవ్ చేసుకుంటారని భావిస్తున్నారు?' అని యాంకర్ ప్రశ్నించగా.. "జనాలు ఏమనుకుంటారో అని ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే, నాకంటూ ఒక వ్యక్తిత్వం ఉండదు. వైజాగ్‌లో చదువుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు నాకు నచ్చిన పనులే చేస్తున్నాను. నేను నమ్మిన ప్రాజెక్ట్‌ను ఎప్పుడూ నిజాయితీగా చేస్తాను' అని శోభిత చెప్పింది. –అక్షరటుడే, సినిమాడెస్క్

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

అక్షరటుడే, ఆంధ్రప్రదేశ్: తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఆగి ఉన్న మినీ లారీని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. అనంతరం ఆ బస్సును ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఏపీలోని మార్కాపురం నియోజకవర్గం కొనకమిట్ల మండలం చిన్నారికట్ల వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి, 12 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.